

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.34 గం.
సహార్ : మంగళవారం ఉ: 4.54 గం.



ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తజనసందోహం

పదోవారం జాతరతో కొమురవెల్లి క్షేత్రం భక్తజనసంద్రమైంది. ఆదివారం మల్లన్ననామస్మరణతో విజయాచల గుట్టలు ప్రతిధ్వనించాయి. బోనాల ఊరేగింపు, శివసత్తుల పూనకాలు, ఆచారవతుల చిందులతో రాజగోపుర పరిసరాలు భక్తిపారవశ్యమయ్యాయి. మొక్కుల చెల్లింపుతో గంగరేగుచెట్టు ప్రాంగణం, ముఖమండపం మార్మోగాయి. మల్లన్న దర్శనానికి క్యూలైన్లు కిక్కిరిశాయి.

జయహో మల్లన్నా

హోరెత్తిన పదోవారం జాతర

- మండుటెండల్లోనూ భారీగా భక్తుల రాక
- దండిగా మొక్కులు, కానుకల సమర్పణ
- ట్రాఫిక్ జామ్‌తో భక్తుల ఇబ్బందులు 7



పట్నంవేసి మొక్కు తీర్చుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

మల్లన్న దయతో అధికారంలోకి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం



శిలువ, మట్టల ఊరేగింపు నిర్వహిస్తున్న మతపెద్దలు

ఘనంగా మట్టల పండుగ

- మెదక్ సీఎస్ఐ చర్చిలో సందడి

మెదక్ కల్చరల్, మార్చి 24 : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం పండగను బిషప్ పద్మరావు ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శిలువ ఊరేగింపుతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం బిషప్ పద్మరావు భక్తులకు మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని ఇలా జరుపుకుంటారని తెలిపారు. ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది. అనంతరం భక్తులకు మతగురువులు ఆశీర్వచనాలందించారు. ఈ కార్యక్రమంలో మతగురువులు డేవిడ్ రిచర్డ్, శ్రీనివాస్, జైపాల్, మినిస్ట్రియల్ బోర్డు కన్వీనర్ ఎమ్. విల్సన్, చర్చి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మెదక్ చర్చిలో భక్తులు

సన్ డే

ఉమ్మడి జిల్లాలో భానుడి భగభగలు

- సిద్దిపేటలో అత్యధికంగా 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- మెదక్ జిల్లా శివ్వంపేటలో 40.3 డిగ్రీలు నమోదు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



మెదక్ అర్బన్, మార్చి 24 : ఉమ్మడి మెదక్ జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మార్చి నాల్గో వారంలోనే 40 డిగ్రీలు దాటేశాయి. మొన్న కురిసిన అకాల వర్షాలకు మూడు జిల్లాల పరిధిలో భిన్నమైన వాతారణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం వరకు ఎండ కొట్టినా.. సాయంత్రం, రాత్రి వేళ్లలో వానలతో చల్లబడింది. రెండు రోజులుగా మళ్లీ భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఓవైపు ఉష్ణోగ్రతలు పెరగడం.. మరోవైపు గాల్లో తేమశాతం తగ్గడంతో వాతావరణం వేడెక్కింది. ఉదయం 8 గంటల నుంచి ఎండవేడిమి మొదలైంది. సాయంత్రం వరకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆదివారం పలు మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేటలో 40.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా, మెదక్ జిల్లాలోని శివ్వంపేటలో 40.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్న వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటోందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎండలతో జర పదిలం

పెరుగుతున్న ఎండలకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరిస్థితుల్లో బయటకు వచ్చే వారు రక్షణ చర్యల్ని తీసుకోవాలని చెబుతున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

గరిష్ఠ ఉష్ణోగ్రతలిలా...

- సిద్దిపేటలో అత్యధికంగా 40.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, చిట్యాల, ధూళిమిట్ట 40.1, ములుగు 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- మెదక్ జిల్లాలోని శివ్వంపేట 40.3, దామరంచ 40.0, పొడ్చన్‌పల్లి 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- సంగారెడ్డి జిల్లాలోని పల్వట్ల 39.6, సదాశివపేటలో 39.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



లెక్క తప్పితే లైసెన్స్ ఫట్

- ఎరువుల స్టాక్‌పై నిరంతర నిఘా
- ఎఫ్ఐవీ యాప్ ద్వారా పర్యవేక్షణ
- వ్యవసాయ అధికారుల పనితీరుపైనా దృష్టి
- క్రమం తప్పకుండా ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 24 : వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఎఫ్ఐవీ (ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్) యాప్‌ను ప్రవేశపెట్టింది. కొరతను నివారించేందుకు ప్రభుత్వం ఎరువుల దుకాణాల వద్దకు వ్యవసాయ అధికారులు వారంలో రెండు రోజులు వెళ్లాలని సూచించింది. సోమ, గురువారం దుకాణాల్లో తనిఖీలు చేయనున్నారు. ఎరువుల కొరతకు కారణాలేంటనే దానిపై పరిశీలించి క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి మరింత పారదర్శకంగా వ్యవస్థ ఉండేలా చేస్తుంది.

జిల్లాలోని 550 ఫర్టిలైజర్ దుకాణాలు

జిల్లాలో 550 వరకు ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. ఎఫ్ఐవీ యాప్ ద్వారా ఈ ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోనున్నారు. డీలర్లు ఎరువుల కొనుగోళ్లు, అమ్మకాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకుండా లెక్క తప్పితే అధికారులు ముందుగా నోటీసులు అందిస్తారు. మిషన్ రిపేరు లాంటివి జరిగినప్పుడు వెంటనే సమాచారం ఇచ్చి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అధికారుల తనిఖీల్లో ఎలాంటి తప్పులు దొర్లినా వెంటనే లైసెన్సు రద్దు చేసేలా ఉన్నతాధికారులు ఆదేశించారు.

తనిఖీలు ఇలా...

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించి వాటిని యాప్‌లో నమోదు చేస్తారు. ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి, స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలోనే షాపులను జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేశారు. సోమ, గురువారాల్లో ఏవో, ఏడీఏ, డీఏవో స్థాయి అధికారులు దుకాణాలు తనిఖీ చేయాలి. నెలలో ఐదుసార్లు దుకాణాలను సందర్శించాలి. జిల్లాలోని అధికారులకు వారి పరిధిలోని ఐదు షాపులను కేటాయించారు. దుకాణదారులు పీవోఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా లేదా, వివరాలు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహిస్తున్నారా తెలియజేయాలి. దీంతో ఎరువుల విక్రయాల తీరును జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. కలెక్టర్, డీఏవో మాత్రమే యాప్‌లోకి లాగినయ్యే అవకాశం ఉంటుంది. దీంతో కిందిస్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతీ దుకాణాన్ని తనిఖీ చేసి, పూర్తి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది.



ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్

తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలోని ఎరువుల షాపుల్లో స్టాక్ నిల్వలపై తనిఖీలు కొనసాగుతున్నాయి. ఏవో, ఏడీఏలతోపాటు డీఏవో సైతం ఎరువుల షాపులను తనిఖీ చేసే ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తున్నాం. వారానికి ఐదు షాపులను తనిఖీ చేసి వాటి వివరాలు నమోదు చేస్తున్నాం. ఎరువుల వివరాలు పారదర్శకంగా ఉండేలా అక్రమాలను అరికట్టేలా ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది. ఎరువుల పట్ల రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



కొండపాకలో ట్యాంకర్ ద్వారా వరి పంటకు నీరు అందిస్తున్న రైతు

ఎండుతున్న వరి.. రైతు పాట్లు

- ట్యాంకర్ల ద్వారా నీటితడి అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం

కొండపాక, మార్చి 24 : రోజురోజుకు ఎండలు పెరగడం, భూగర్భ జలాలు పడిపోవడంతో వ్యవసాయ బావులు, బోర్లలో నీరు తగ్గుముఖం పట్టింది. కొన్నిచోట్ల అడుగంటిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో కాపాడుకోవడం కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొంతమంది రైతులు చేసేదేమీ లేక పశువులకు మేతగా విడిచిపెడుతున్నారు. మరికొందరు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కొండపాకకు చెందిన రైతు మహేష్ వరి పంటను కాపాడుకోవడం కోసం ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు. భూగర్భ జల వనరులు తగ్గడంతో తనకు ఉన్న బోరు ఎండిపోయింది. వరి పంటకు సరిపోయే నీరు అందడం లేదు. కళ్ల ముందు వంటలు ఎండిపోవడాన్ని చూసి తట్టుకోలేక ఎలాగైనా సరే కాపాడుకోవాలని బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు తెస్తూ పంటలకు అందిస్తున్నాడు.

'కార్డు'కు కోడ్ అడ్డు

నిలిచిన రేషన్ కార్డుల పంపిణీ

మెదక్, మార్చి 24: కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త రేషన్‌కార్డులు వస్తాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇందుకు తగినట్టే ప్రభుత్వం కూడా అర్హులైనవారికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని సంకల్పించింది. దీంతో దాదాపు దశాబ్దం నుంచి రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఆశలు చిగురించాయి. ఇంతలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సంక్షేమ పథకాలకు బ్రేక్ పడింది. సామాన్య ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాతే మళ్లీ కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆహారభద్రతా కార్డులు లేకపోవడంతో అర్హులు గ్యారెంటీలకు దూరమౌతున్నారు. కనీసం పెళ్లిళ్లు అయిన వాళ్లు కొత్తగా రేషన్‌కార్డులను పొందేందుకు గానీ, తమ పేర్లు మార్చుకునేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఉమ్మడి కుటుంబాలలో సోదరులు విడిపోయి వేరు కాపురాలు పెట్టడం లాంటివి చోటుచేసుకుంటున్నాయి. కార్డులలోని సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే వారి పేర్లను మాత్రం వెంటనే గ్రామకార్యదర్శులు ఇచ్చే నివేదిక ఆధారంగా తొలగిస్తున్నారు.

2018కి ముందు దరఖాస్తు చేసుకున్న వారికే..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో 2014లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించింది. 2018 సంవత్సరానికి ముందు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు దాని ప్రకారమే 2022 సంవత్సరంలో చివరిసారిగా ఆహార భద్రతా కార్డులు పంపిణీ చేశారు. కానీ, కార్డులలో మార్పులకు దరఖాస్తుదారులకు అవకాశం కల్పించలేదు. వారికి ప్రభుత్వ పథకాలు అందడంలేదు. కొత్త ప్రభుత్వమైనా అర్హులకు ముందుగా నూతన కార్డులు జారీ చేసి తర్వాత పథకాలు అమలు చేయాలని కోరుతున్నారు. ఈ నెల 16 దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇది జూన్ 6వతేదీ వరకూ కొనసాగుతుంది. అప్పటి వరకూ కొత్త రేషన్ కార్డుల జారీ ఉండదు.



తప్పుడు సమాచారం షేర్ చేస్తే జైలుకే

- సోషల్ మీడియాపై నిరంతర నిఘా 7
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ప్రత్యేక చర్యలు

రంగుల కేళీ

- నేడు హోలీ సంబురాలు

మెదక్ కల్చరల్, మార్చి 24: వసంత ఆగమనానికి సూచికగా హోలీ జరుపుకుంటారు. హోలీ అంటేనే రంగుల పండగ. చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగితేలుతారు. ఒకప్పుడు ప్రకృతి ప్రసాదించిన పువ్వులు, ఆకులతో తయారు చేసుకున్న రంగులతో హోలీ జరుపుకునేవారు. ప్రస్తుతం సహజ రంగుల వాడకం కనిపించడం లేదు. మార్కెట్‌లో దొరికే రసాయనాలతో తయారుచేసిన రంగులకు బదులుగా ఇంట్లోనే సహజ రంగుల్ని తయారు చేసుకోవడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. రంగుల తయారీలో వాడే పూలు, ఆకులు, మొక్కల్లోని ఔషధ గుణాలు చర్మానికి, శరీరానికి మేలు చేస్తాయని అంటున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- రసాయన రంగులు కళ్లలో పడకుండా సన్ గ్లాసెస్ దరించాలి. దంతాలపై రంగులు పడకుండా డెంటల్ క్యాప్స్ వాడాలి.
- హోలీ ఆడే సమయంలో ముదురురంగు దుస్తులు ధరించాలి. చేతులను కప్పేలా ఫుల్‌స్లీవ్స్ వేసుకుంటే మంచిది.
- తలపై రంగులు పడకుండా క్యాప్ ధరించాలి.
- కంట్లో రంగులు పడితే చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. మంటగా అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- రంగుల్లో ఆడటం పూర్తయ్యాక గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి.



ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 24 : హోలీ పండుగను సంప్రదాయ పద్ధతిలో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు పోలీసు శాఖ తరఫున ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగను చేసుకోవాలని, సహజ సిద్ధమైన రంగులను వాడాలని సీపీ సూచించారు. యువత చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు వారిని గమనించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని సూచించారు. వాహనాలను అతివేగంతో ర్యాష్‌గా నడపొద్దని, ట్రిపుల్ డ్రైవింగ్ చేయొద్దని కోరారు.

హోలీ శుభాకాంక్షలు : మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్, మార్చి 24: ప్రజలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో హోలీ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. ప్రజలందరూ భేద భావాలు వీడి పరస్పర ప్రేమాభిమానాలతో సంతోషంగా మోదుగు పూల వంటి సహజ సిద్ధమైన రంగులతో హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు.

హోలీ శుభాకాంక్షలతో
ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

నేడు పైతరలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

● హాజరుకానున్న మాధవానంద సరస్వతి

కొల్చారం, మార్చి 24: కొల్చారం మండలం పైతర గ్రామంలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం సోమవారం జరగనున్నది. మాధవానంద ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పర్యవేక్షణలో.. ఆలయ పురోహితుడు కృష్ణత్రిపాటి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరగనున్నది. ఇందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అందుకనుగుణంగా స్వామివారి ఆలయాన్ని రంగులతో అలంకరించారు. దేశవ్యాప్తంగా హోలీ వేడుకలు జరుగుతుండగా పైతర గ్రామంలో మాత్రం గ్రామస్థులు స్వామివారి కల్యాణంలో పాల్గొంటారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం, మరుసటి రోజు తెల్లవారుజామున స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు.



ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం

పోచాపూర్ దాబాలో మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 24: సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్ శివారులో గల ఓ దాబాలో సంగారెడ్డి జిల్లా సీసీఎస్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో సుమారు 58 లీటర్ల విలువ గల 200 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్‌లోని గణేష్ వైన్స్ నుంచి కొనుగోలు చేసి దాబాలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా మద్యాన్ని సీజ్‌చేసి దాబా యజమాని రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.78 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరవింద్, హరి పాల్గొన్నారు.

హోలీ శుభాకాంక్షలతో
SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

హోలీ శుభాకాంక్షలతో
ఏప్రిల్ 6న బ్రహ్మాండమైన విడుదల



SBK FILMS - 9849761038/9652052424

హోలీ శుభాకాంక్షలతో
ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల



ONE MEDIA 7799090708

హోలీ శుభాకాంక్షలతో నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్
11.00,6.00,9.00

హోలీ శుభాకాంక్షలతో విజయవంతమైన 3వ వారం



కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.15,6.00,9.15
GLOBAL CINEMAS LLP

విజయవంతమైన 2వ వారం
వెండి తెరపై ఘన చరిత్ర సృష్టిస్తున్న గత చరిత్ర
బాక్సాఫీస్ దగ్గర విజయపథంగా దూసుకుపోతున్న



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

BHUVANESHWARI PICTURES

హోలీ శుభాకాంక్షలతో విజయవంతమైన 3వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.15,6.00,9.15

హోలీ శుభాకాంక్షలతో ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

HEART - WARMING ENTERTAINER
హోలీ శుభాకాంక్షలతో నేడే చూడండి



DISTRIBUTION BY PVR INOX PICTURES

హోలీ శుభాకాంక్షలతో నేడే చూడండి



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00

ప్రేక్షకులు మెచ్చిన చిత్రం నేడే చూడండి



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.00pm
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
NTR CINEMAS 9030161717



వేషధారణతో మల్లన్నను స్తుతిస్తూ నృత్యం చేస్తున్న ఆచారవతులు

జయహో మల్లన్నా..

● హోరెత్తిన 10వ వారం జాతర ● మండుటెండల్లోనూ భారీగా తరలివచ్చిన భక్తజనం ● మొక్కులు, కానుకల సమర్పణ



మల్లన్నకు పెద్దపట్నం రచించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సిద్దిపేట, మార్చి 24: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్స వాలలో భాగంగా 10వ వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. జయహో... కొమురవెల్లి మల్లన్న స్వామి జయహో... అంటూ జయ జయధ్వానాలు చేసి భక్తులు తన్మయత్వం చెందారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. స్థానికంగా వంట చెరకు, మట్టికుండ, కూరగాయలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేశారు. బెల్లం పాయసం నైవేద్యం పెట్టి బసచేసిన ప్రదేశం, గంగిరేగుచెట్టు ప్రాంగణం, ముఖమండపాలలో చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 2 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులు పడ్డారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టగా, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ జామ్.. భక్తులకు తప్పని ఇక్కట్లు

ఆర్టీసీ బస్టాండు సమీపంలో వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరించకపోవడంతో పాటు భారీ లోడుతో ఉన్న డీసీఎంను అనుమతించడంతో ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుపై వాహనాలు అడ్డంగా నిలపడంతో పాటు ఒకేదారి గుండా రాకపోకలు సాగించడంతో చిక్కుకున్నాయి. భక్తులు, ద్విచక్ర వాహనదారులు నానాతంటాలు పడ్డారు. పోలీసులు గమనించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. అప్పటి వరకు ఎండలో ఇబ్బందులు పడ్డారు.

నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం అందించిన భక్తుడు

మల్లన్న ఆలయ నిత్యాన్నదాన పథకానికి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు గ్రామానికి చెందిన ఈనుకొండ మల్లారెడ్డి ఆదివారం రూ.50,116 విరాళంగా అందించాడు. ఈ మేరకు ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్ వారికి స్వామివారి ప్రసాదం, రశీదు అందించారు.



మల్లన్నకు అభిషేకం నిర్వహించిన అనంతరం పొన్నం దంపతులను ఆశీర్వదిస్తున్న వీరశైవార్చకులు

మల్లన్న దయతో అధికారంలోకి..

● బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, మార్చి 24: కొమురవెల్లి మల్లన్న దయతో అధికారంలోకి వచ్చామని, ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలై ప్రజాసమస్యలు పరిష్కారమవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆదివారం మంత్రి ప్రభాకర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బోనం నివేదించి గర్భాలయంలో అభిషేకం నిర్వహించారు. ముఖమండపంలో పట్నం రచించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు, ఒగ్గు పూజారులు స్వామి వారం ప్రసాదం, బండారి అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు తన గెలుపుతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని మల్లన్నను వేడుకున్నానని, తాము విజయం సాధించడంతో మొక్కులు తీర్చుకునేందుకు కొమురవెల్లికి కుటుంబసమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకున్నామన్నారు. మల్లన్న ఆశీర్వాదంతో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో రాష్ట్రం అన్నిరంగాల్లో విలసిల్లాలని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ధర్మకర్త లింగంప ల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనుకు కంచె.. రైతుకు ప్రాణ సంకటం

● ప్రాణాలు తీస్తున్న విద్యుత్ కంచెలు, వారంరోజుల్లోనే ఇద్దరి మృతి
● పశువుల మరణాలు అయితే లెక్కేలేదు
● నివారణకు చర్యలు చేపట్టాలని రైతుల డిమాండ్



ధరావత్ రాంసింగ్(ఫైల్)



అంతర్గాం జైపాల్(ఫైల్)



జొన్న చేనుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె (వృత్తంలో)

కల్హేర్, మార్చి 24: నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలవుతున్నాయి. పంట దిగుబడిలో వచ్చే కొద్దిపాటి లాభం కోసం పంటకు రక్షణగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలకు తగిలి విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని కొత్తచెరువు తండా శివారులో పోమ్యానాయక్‌తండాకు చెందిన ధరావత్ రాంసింగ్(38), సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్‌లో అంతర్గాం జైపాల్(30) అనే యువకులు వారంరోజుల వ్యవధిలో విద్యుత్ కంచెలకు బలయ్యారు. 2001 జనవరిలో మండలంలోని మాసాన్‌పల్లికి చెందిన వల్లూరి శివశంకర్(10) అనే బాలుడు నేరేడు పండ్లకు వెళ్లి సమీపంలో నారుమడికి పెట్టిన విద్యుత్ కంచెకు తగిలి మృతి చెందాడు. అదేవిధంగా 2002లో మండలంలోని బాచేపల్లి షేకలికుంటాతండాకు చెందిన దిలీప్(45) మేత కోయడానికి వెళ్లి మొక్కజొన్న పంటకు పెట్టిన విద్యుత్ కంచెకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇవి తెలిసిన ఘటనలు తెలియనివి ఎన్నో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు

అడవి పందులు, కోతుల బారి నుంచి జొన్న, మొక్కజొన్న, వరి తదితర పంటలను కాపాడుకోవడానికి పంట చుట్టూ విద్యుత్ తీగలతో కంచె ఏర్పాటు చేసి రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తారు. అలెర్ట్‌గా ఉన్నవారు తెల్లవారు జామునే వెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. కొందరు అక్కడికి ఎవరు వస్తారులే అని విద్యుత్ సరఫరాను నిలిపివేయకపోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రతి సంవత్సరం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రమైన కల్హేర్‌లో కూడా పదిరోజుల క్రితం పశువుల కాపరులు తృటిలో ప్రాణాలు దక్కించుకున్నట్లు తెలిసింది. ముందు కుక్క వెళ్లడంతో కంచెకు తగిలి కుక్క బలికాగా.. వారు ప్రాణాలతో బయటపడ్డారు. అలాగే విద్యుత్ కంచెలకు తాగి మృత్యువాత పడిన పశువుల లెక్కేలేదు.

లాభం కంటే.. నష్టమే ఎక్కువ..

పంట రక్షణ కోసం విద్యుత్ కంచె ఏర్పాటు చేసి పంటలు పండించే రైతులకు గతంలో ఇలాంటి సంఘటనలు జరగడంతో వారు కంచెలు ఏర్పాటు చేయడమే మానేశారు. పంట దిగుబడిలో వచ్చే లాభం కంటే.. ఇలాంటి ఘటనల వల్ల పడే ఇబ్బందులు ఎందుకని విద్యుత్ కంచెల ఏర్పాటు జోలికి పోవడం లేదు. ఈ కంచెలను జనసంచారం లేని గిరిజన తండాల్లోనే ఎక్కువశాతం ఏర్పాటు చేస్తున్నారు. అలాంటి వారికి ట్రాన్స్‌కో అధికారులు అవగాహన కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం: నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంటలకు విద్యుత్ కంచెలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై రైతులకు అవగాహన కల్పించి నివారణకు ప్రయత్నం చేస్తాం. అయినా ఎవరైనా రైతులు కంచెలు ఏర్పాటు చేస్తే విద్యుత్ చౌర్యం కింద కేసులు నమోదు చేస్తాం. కంచెలు వేసి నిర్లక్ష్యంగా వ్యవహరించే రైతులకు విద్యుత్ కనెక్షన్లు నిలిపేస్తాం.

గంజాయి అమ్ముతున్న ఐదుగురి అరెస్ట్

● 925 గ్రాముల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జగదేవ్‌పూర్, మార్చి 24: గంజాయి అమ్ముతున్న ఐదుగురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ గ్రామ పరిధిలోని ఏఎంఆర్ కాల్వ వద్ద గంజాయి అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి కాల్వ వద్దకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతున్న మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన జుర్రు ఆకాశ్, పీర్లపల్లికి చెందిన బర్రెంకల శ్రీధర్, జగదేవ్‌పూర్‌కు చెందిన దోమ మహిపాల్, రాయవరంకు చెందిన నవీన్‌లను అదుపులోకి తీసుకోగా.. వారి వద్ద ఉన్న గంజాయి ప్యాకెట్లను చూపించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా మునిగడప గ్రామానికి చెందిన దేవుని నవీన్‌కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వెంటనే నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోగా.. అతని వద్ద 325 గ్రాముల గంజాయితో పాటు రూ.2 వేలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

గడ్డి కట్టింగ్ చేస్తుండగా కిందపడి యువ రైతు మృతి

కౌడిపల్లి, మార్చి 24: పొలంలో గడ్డి తీసే క్రమంలో కిందపడి ఓ యువ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సింగూరి కుమార్(23) తన వ్యవసాయ పొలంలో గడ్డి కోసే యంత్రంతో కట్టింగ్ చేస్తుండగా.. ఒక్కసారిగా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన రైతులు వచ్చి చూసేసరికి కుమార్ అప్పటికే మృతిచెంది ఉన్నాడు.

టాటా ఏస్‌ను ఢీకొన్న కంటైనర్

● ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలతో క్షతగాత్రులు

కౌడిపల్లి, మార్చి 24: టాటా ఏస్‌ను కంటైనర్ ఢీకొట్టగా.. ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలోని రాయిలపూర్‌లో గేట్ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం రుస్తుంపేట్ గ్రామానికి చెందిన చికరి చెన్నయ్య, మద్దికుంట శివులు, సందిల కృష్ణ మిషన్ భగీరథలో పనిచేస్తున్నారు. రాయిలపూర్ గేట్ సమీపంలో పనిచేసి తిరిగి టాటా ఏస్ వాహనంలో నర్సాపూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వస్తున్న కంటైనర్ వేగంగా వస్తూ ఓవర్ టేక్ చేయబోయి.. టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో చికరి చెన్నయ్య, మద్దికుంట శివులు, సందిల కృష్ణకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో బెల్టు జోరు

● ఒక్కో గ్రామంలో 5 నుంచి 10 బెల్టుషాపులు
● ఎంఆర్‌పీ కంటే అధిక ధరలు వసూలు
● ఎన్నికల కోడ్ ఉన్నా.. మద్యం అమ్మకాలు
● పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్‌శాఖలు



కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి చౌరస్తా వద్ద ఉన్న వైన్స్

కొల్చారం, మార్చి 24: కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో 5 నుంచి 10 వరకు బెల్టు షాపులు నడుస్తున్నాయి. వైన్స్‌షాపుల్లో ఎంఆర్‌పీ ధరల కంటే అధిక రేటుకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. కిరాణా దుకాణాలు మొదలు నివాస గృహాలు, కల్లు కాంపౌండ్‌లు అడ్డాలుగా చేసుకుని 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా వ్యాపారం సాగిస్తున్నారు. కొల్చారం మండలవ్యాప్తంగా 21 గ్రామపంచాయతీలు ఉండగా పోతంశెట్‌పల్లి, రంగంపేట వైన్స్‌ల ద్వారా దాదాపుగా 100కు పైగా అనుమతులు లేని అక్రమ బెల్టుషాపులు నడుస్తున్నాయి. వైన్స్‌షాపుల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మకాలు సాగుతాయి. కానీ బెల్టుషాపుల్లో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ మద్యం విక్రయిస్తారు. బెల్టుషాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఒక్కో క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.40, బీరు బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50, 90 ఎంఎల్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30లు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు కానీ, పోలీసులు కానీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అటు వైన్స్‌ల వద్ద, ఇటు బెల్టుషాపుల వద్ద నెలవారీ మామూలు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

ఎన్నికల నిబంధనలు వర్తించవా?

దేశం మొత్తం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొల్చారం మండలంలో బెల్టుషాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతుండడం, ఏడుపాయల రోడ్డు వెంట వెలసిన హోటళ్లలో యథేచ్ఛగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం వంటివి ఎన్నికల కమిషన్ ఆదేశాలను విస్మరించడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

దేశంలో బీజేపీ గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి

● రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 375 రద్దు ఘనత మోదీకే దక్కింది ● బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

నిజాంపేట, మార్చి 24: దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, 500 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామమందిర నిర్మాణం, 375 ఆర్టికల్ రద్దు చేసి కాశ్మీర్ భారతదేశంలో కలిపిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా మండల పరిధిలోని చల్మెడ శివారులో గల తిరుమలస్వామి, పెద్దమ్మతల్లి ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందిగామ గ్రామ తాజా మాజీ సర్పంచ్ లద్ద ప్రీతిరాజగోపాల్‌ను కలిసి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదవారి కష్టాలు ఎలా ఉన్నాయో.. వందరోజుల రేవంత్‌రెడ్డి పాలనలో కూడా అదేవిధంగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ప్రతీ కార్యకర్త బాధ్యతగా తీసుకుని మూడోసారి మోదీకి ప్రధానమంత్రిగా అవకాశం ఇస్తే.. రూ.750 కోట్లతో అబుదాబిలో రామమందిర నిర్మాణాన్ని చేసుకుందామన్నారు. 100 రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. అనంతరం మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు తీగల శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రమేష్ పాల్గొన్నారు.

పుట్‌పాత్ పైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

● బీడీఎల్ ఉద్యోగి దుర్మరణం



పుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

పటాన్‌చెరు, మార్చి 24: పుట్‌పాత్ పైకి బస్సు దూసుకురావడంతో భానూర్ బీడీఎల్ పరిశ్రమలో పనిచేసే ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం జాతీయ రహదారిపై శనివారం రాత్రి 12 గంటలకు చోటు చేసుకున్నది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. రామచంద్రాపురం ఎస్ఎన్ కాలనీకి చెందిన జి.యాదయ్య (58) భానూర్ బీడీఎల్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే పరిశ్రమ కార్మికులను తీసుకెళ్లే ఎస్‌టీఎస్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్నది. అయితే డ్రైవర్ నిద్రమత్తులో అజాగ్రత్తగా నడపడంతో హఠాత్తుగా పుట్‌పాత్‌పైకి దూసుకెళ్లి రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న రాజధాని హోటల్ వద్ద నిలబడి ఉన్న యాదయ్యను ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అంతటితో ఆగని బస్సు పక్కనే ఉన్న డబ్బాలను, షెడ్లను ఢీకొని నిలిచిపోయింది. బస్సు దూసుకురావడాన్ని గమనించిన కొందరు పక్కకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు బీభత్సం దృశ్యాలు హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో నిక్షిప్తం అయ్యాయి. కాగా డ్రైవర్ నిద్రమత్తులో ప్రమాదం చేశాడా లేదా మద్యం సేవించాడా అన్నది తేల్చాల్సి ఉన్నది. పరారీలో ఉన్న డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం, మార్చి 24: అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మడిదల మండలం అనంతారం గ్రామానికి చెందిన పెరుగు కృష్ణ(54) ఏడాది నుంచి అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముట్టడంతో శనివారం రాత్రి 7:30 గంటలకు ఇంట్లోంచి వెళ్లి స్థానిక చెరువు సమీపంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు, స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహేశ్వరరెడ్డి తెలిపారు.

వెంకటాపూర్ (పీటీ)లో చిన్నారిపై కోతుల దాడి

తూప్రాన్, మార్చి 24: తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్(పీటీ)లో కోతుల దాడిలో ఆదివారం ఓ చిన్నారి గాయపడింది. వెంకటాపూర్‌కు చెందిన వెన్నెల(6)పై ఉదయం కోతులు దాడిచేశాయి. గుర్తించిన స్థానికులు అడ్డుకోగా ప్రమాదం తప్పింది. కోతుల బెడదను తొలగించాలని కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కోతులను బంధించి దూర ప్రాంతంలో వదిలిపెట్టాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్ జిల్లాకు రజతం

తూప్రాన్, మార్చి 24: ఉమ్మడి నల్గొండ జిల్లా ఆలేరులో శని, ఆదివారాలు నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర ఛాంపియన్‌షిప్ పోటీల్లో మెదక్ జిల్లా జట్టు రజత పతకం సాధించినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా పేర్కొన్నారు. జిల్లా జట్టులో శ్రీరామ్ ఉత్తమ క్యాచర్ అవార్డు దక్కించుకున్నట్లు తెలిపారు. పతకం సాధించిన జట్టును, జట్టు కోచ్‌లుగా సుమన్, భాస్కర్‌ను అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్ అభినందించారు.



రజత పతకం సాధించిన మెదక్ జిల్లా జట్టు

తప్పుడు సమాచారం షేర్ చేస్తే జైలుకే

● సోషల్ మీడియాపై 24/7 పోలీసుల నిఘా
● వాట్సాప్, ఫేస్‌బుక్‌లపై నిరంతర పర్యవేక్షణ
● జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక విభాగం



సంగారెడ్డి క్రైం, మార్చి 24: ప్రస్తుతం ప్రపంచంలో ఏ మూల ఏమైందో క్షణాల్లో తెలిసిపోతోంది. ఇందుకు సోషల్ మీడియా వేదికగా నిలుస్తోంది. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై సంగారెడ్డి జిల్లా పోలీసులు 24/7 నిఘా పెట్టారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా లేదా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే ఎంతటి వారైనా చర్యలు తీసుకొనేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది. వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టు చేస్తే సంబంధిత గ్రూప్‌ల అడ్మిన్‌పై కేసులు నమోదు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ను ఏర్పాటుచేసి సోషల్ మీడియాపై కన్నేశారు. వాట్సాప్, ఫేక్‌బుక్‌లలో ఎవరెవరు ఎటువంటి పోస్టింగ్‌లు చేస్తున్నారు, దానివల్ల శాంతిభద్రతలకు ఏమైనా భంగం వాటిల్లే ప్రమాదం ఉందా? అనే విషయాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాగా జిల్లా ప్రజలంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలని, జిల్లా ప్రజలెవరైనా ఇతర పార్టీలను గానీ, వ్యక్తులను గానీ కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టరాదని మల్టీజోన్-2 ఐజీపీ జి.సుధీర్‌బాబు సూచించారు. జిల్లా సరిహద్దు జిల్లాల్లోని పోలీసు అధికారులతో ఇటీవల సంగారెడ్డిలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా బార్డర్ సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆదేశించారు.

మంచి కోసమే వినియోగించాలి

సోషల్ మీడియాను కేవలం ప్రజా సంబంధాలు, సమైక్యత పెంపొందించే విధంగా, అభివృద్ధికి సంబంధిత సమాచారం చేరవేయడం కోసమే వినియోగించాలి. అంతేగానీ ఇతరుల అనుమతి లేకుండా ఫొటోలు తీసి వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అప్‌లోడ్ చేయడం వల్ల వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగే అవకాశం ఉన్నది. సమాజంలో ఉద్రిక్తతకు దారితీసే విధంగా పోస్టులు చేస్తే చట్ట ప్రకారం నేరం. అటువంటి వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నది. వాట్సాప్ గ్రూప్‌ల అడ్మిన్లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. గ్రూప్ సభ్యులలో ఎవరైనా అభ్యంతకర పోస్ట్ పెడితే వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కూడా కేసులు నమోదు చేయవచ్చు. ఒకవేళ గ్రూప్ అడ్మినే అభ్యంతరకరమైన పోస్టింగ్ చేస్తే ఐపీసీ సెక్షన్ 153(ఏ) కింద మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్నది.

గ్రూప్ అడ్మిన్‌లదే బాధ్యత: రూపేష్, ఎస్పీ



ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా పెట్టాం. వాటిల్లో ఎవరైనా అభ్యంతకరమైన, ఉద్రిక్తతకు దారితీసే, వివాదాస్పద పోస్టులు పెడితే సంబంధిత వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. నేరం రుజువైతే జైలు శిక్ష పడే అవకాశం ఉన్నది. తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మెసేజ్‌లు పెట్టకూడదు. కొంతమంది తమకు వాట్సాప్‌లలో వచ్చిన ప్రతి సమాచారాన్ని, ఫొటోలను ఇతర గ్రూప్‌లకు ఫార్వార్డ్ చేస్తుంటారు. ఆలోచించకుండా అందరికీ షేర్‌చేస్తే సమస్యలకు దారి తీస్తుందన్న విషయాన్ని గమనించాలి.

రాజకీయ డ్రామాకు తెరలేపిన నర్సారెడ్డి, ప్రతాప్‌రెడ్డి

● బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌యాదవ్

గజ్వేల్, మార్చి 24: ప్రతాప్‌రెడ్డి, నర్సారెడ్డిలు రాజకీయ డ్రామాకు తెరలేపారని బీజేపీ పట్టణాధ్యక్షుడు డి. మనోహర్ యాదవ్ అన్నారు. గజ్వేల్ పట్టణ కేంద్రంలో బీజేపీ పట్టణ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్ రాజకీయాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నర్సారెడ్డి, ప్రతాప్‌రెడ్డి మాటలు రాజకీయ డ్రామా అని, వారి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. కేవలం ఎన్నికలవేళ వారిద్దరి చుట్టూ గజ్వేల్ రాజకీయాలు ఉన్నాయన్నట్టుగా డ్రామాకుకు తెర తీశారన్నారు. ఆయనవెంట బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు కొలుపుల నరేందర్, ఐల మహేందర్, మంద వెంకటేష్ బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు మైస విజయ్, నాయిని సందీప్, వడ్డేపల్లి ప్రసాద్, మాదగారి నరసింహ, బీజేపీ పట్టణ కార్యదర్శులు కొన్ని రాజశేఖర్‌రెడ్డి, ఢిల్లీ నవీన్, కోశాధికారి లింగంపల్లి హరికుమార్, అధికార ప్రతినిధులు ఎల్ల బాబు, ఎర్రగొల్ల రాజు యాదవ్, వివిధ మోర్చాల అధ్యక్షులు మెతుకు కర్ణాకర్, కుంకుమరాణి, సంగం కర్ణాకర్, గడ్డమీద ప్రశాంత్, దువ్వల రాజు యాదవ్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సాయి తేజ తదితరులున్నారు.

అందె భాస్కర్‌ను సన్మానించిన సీఎం రేవంత్‌రెడ్డి

మిరుదొడ్డి, మార్చి 24: మండలంలోని అందె గ్రామానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అందె భాస్కర్‌కు ఇటీవల ఉస్తాద్ బిస్మిల్లా యువపురస్కారాన్ని ప్రకటించారు. ఆదివారం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన డప్పును బహూకరించారు.

నర్సారెడ్డిని విమర్శించే స్థాయి ప్రతాప్‌రెడ్డికి లేదు

● టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి

మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని విమర్శించే స్థాయి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతాప్‌రెడ్డి వందల కోట్లు సంపాదించారని, అనేక అక్రమాలకు పాల్పడిన ప్రతాప్‌రెడ్డి నర్సారెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నర్సారెడ్డిపై చౌకబారు ఆరోపణలు చేస్తే ఉరుకునేది లేదని, వారికి మాటలతో కాదు చేతులతో సమాధానం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



కొండపాక: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగారావు

గజ్వేల్, మార్చి 24: నర్సారెడ్డిని విమర్శించే స్థాయి ప్రతాప్‌రెడ్డికిలేదని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రతాప్‌రెడ్డి యత్నిస్తున్నాడని, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని విమర్శించే స్థాయి ప్రతాప్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. గజ్వేల్ కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి నక్క రాములు గౌడ్ గజ్వేల్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా పనిచేసిన నర్సారెడ్డి ఐదేళ్లలో ఒక్క రూపాయి అక్రమ సంపాదన సంపాదించలేదన్నారు. ఆయనవెంట నాయకులు వహీద్‌ఖాన్, క్యాసారం బాబ, సొక్కం సురేశ్, జాకీర్, మల్లారెడ్డి, లక్ష్మణ్, శివులు, ఆంజనేయులు, జహంగీర్, శ్రావణ్‌కుమార్, హసన్, వెంకటేశం ఉన్నారు.

● **జగదేవ్‌పూర్:** మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై ఎఫ్‌డీసీ మాజీ చెర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చెర్మన్‌లు న్యాలమడుగు హన్మంతరెడ్డి, ధర్మారం మల్లేశంలు హెచ్చరించారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడపలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మచ్చేందర్‌రెడ్డి, వెంకట్‌స్వామి, నరసింహారెడ్డి, అమరరాము, పంచెద్దుల ప్రసాద్, భాస్కర్, కిషన్ యాదవ్, యాదగిరి, రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అశోక్, మధుకర్ తదితరులు ఉన్నారు.

● **దుబ్బాక:** నర్సారెడ్డిని విమర్శించే హక్కు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి లేదని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్ మండిపడ్డారు. ఆదివారం దుబ్బాకలో వారు మాట్లాడారు.

● **కొండపాక:** డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై విమర్శలు చేసే అర్హత బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డికి లేదని కాంగ్రెస్ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు అన్నాడు. ఆదివారం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవకాశం కోసం, స్వార్థ రాజకీయం కోసం పూటకో పార్టీ మార్చే ప్రతాప్‌రెడ్డికి ఇతరుల గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్ట పరశురాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు పంజా అఖిల్, ఉపాధ్యక్షుడు పంజా చిరంజీవి, సోషల్ మీడియా ఇన్‌చార్జి మెరుగు ప్రభాస్ పాల్గొన్నారు.

● **వర్గల్:** గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి హెచ్చరించారు. ఆదివారం వర్గల్ మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చిన నర్సారెడ్డి ప్రజల కోసం సర్వం కోల్పోయారని, ఆయనను విమర్శిస్తే పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అట్ల సందీప్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, ఎంపీటీసీలు శ్రీనివాస్, ప్రవీన్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు సుల్తాన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పసుల రమేశ్, భానుప్రసాద్, కరుణాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, నర్సింలు, గోవర్ధన్, నర్సారెడ్డి, కిషన్, గణేశ్, నందు, యాదగిరి, బాలరాజు, బాలకృష్ణరెడ్డి, సంజీవులు, నర్సింలు, పాల్గొన్నారు.



వర్గల్‌లో మాట్లాడుతున్న నాయకులు



దుబ్బాకలో మాట్లాడుతున్న నాయకులు



తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అధికారుల సమాచారం లేకుండా పోతున్నది. అధికారులు మారినా బోర్డుల్లోని వివరాలను మార్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నూతన ఆర్డీవోగా రామ్మూర్తి వచ్చినా సమాచార హక్కు చట్టం బోర్డుపై మాత్రం ఆయన పేరు రాయలేదు. బోర్డుపై తహసీల్దార్ పేరు మాత్రమే రాసి ఫోన్ నంబర్‌ను విస్మరించారు.

- దూళిమిట్ట

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

కుకునూర్‌పల్లి, మార్చి 24: డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం రిమ్మనగూడలోని ఓ రెస్టారెంట్ వద్ద లకుడారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మెర్గోజు కర్ణాకర్ చారి , కానుగుల చంద్రం ,లంబ మైసయ్య ,బచ్చలి రవీందర్, రాజలింగం, దేవి భూపాల్ చీర బోయిన మహేష్, శివకుమార్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి నర్సారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వాసరిరావు మాజీ సర్పంచులు ఐలమ్ యాదవ్ ,నాగపురి మురళి, నరసింహచారి, కోల ఉపేందర్, రెడ్డమైన రవి, వీరేశం కిష్టారెడ్డి, రెడ్డమైన రవీందర్, అండలమ్మ, మంజే స్వామి పాల్గొన్నారు.

టెట్ పరీక్ష దరఖాస్తు రుసుము తగ్గించాలి

● ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు

సిద్దిపేట, మార్చి 24 : టెట్ పరీక్ష దరఖాస్తు రుసుమును ప్రభుత్వం తగ్గించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు కోరారు. చేర్యాల పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రూ.400 ఉన్న రుసుమును ప్రభుత్వం రూ.1000కి పెంచడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు భారంగా మారిందన్నారు. నోటిఫికేషన్లకోసం ఆశతో ఎదురుచూస్తున్నప్పటికీ, దరఖాస్తు ఫీజులు వేలల్లో ఉండటంతో ఇబ్బందులుపడుతున్నారని, ప్రభుత్వం పునరాలోచించి రుసుము తగ్గించాలని కోరారు.

ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం కార్యవర్గం ఏర్పాటు

కొండపాక, మార్చి 24 : మండలంలోని దుద్దెడ ఆరే క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గురజాడ బాలాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుగుల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బూర్గుల రాజేష్, బూరుగుల రాజు, ప్రధాన కార్యదర్శిగా కుసుంబ హరికిషన్, సహాయ కార్యదర్శిగా కుసుంబ సతీష్, కోశాధికారిగా బూర్గుల కనకారావు, కార్యవర్గ సభ్యులుగా కందుల రాజేశ్వరరావు, బూరుగుల బాలయ్య, బూర్గుల వెంకటరమణ, ఇరువాల కాంతారావు, గాజులపాటి రాజులతో కార్యవర్గం ఏర్పాటయింది. నూతన కార్యవర్గానికి వ్యవస్థాపక అధ్యక్షుడు బాలాజీ అభినందనలు తెలిపారు.

దుద్దెడ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

దుద్దెడ గ్రామ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం దుద్దెడలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బాకి రాజు, ప్రధాన కార్యదర్శిగా రోశిలి కిషన్, కోశాధికారిగా కౌడాయపల్లి ఎల్లం, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కొమ్ము నర్సింలు, సహాయ కార్యదర్శులుగా రోసిలి నాగరాజు, పల్లె అరుణ్, క్రీడల కార్యదర్శిగా పల్లె సంపత్, ప్రచార కార్యదర్శిగా బాకి రాజశేఖర్, రోశిలి కరుణాకర్, సాంస్కృతిక కార్యదర్శిగా పల్లె బాబు, కార్యనిర్వహణ అధికారిగా పిల్లి శివరాజ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ ముఖ్య సలహాదారులు రోశిలి బిక్షపతి, బాకి ప్రభాకర్, పిల్లి యాదయ్య, సీనియర్ సభ్యులు కొమ్ము మల్లికార్జున్, పల్లె యాదగిరి, కొమ్ము స్వామి, బాకి రవి, పిల్లి అశ్వద్ధామ, కొమ్ము లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీని పట్టుకున్న పోలీసులు



పట్టుకున్న లారీతో పోలీసులు

కొండపాక, మార్చి 24 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని కుకునూరుపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న లారీని మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

నారాయణఖేడ్, మార్చి 24: ఖేడ్ మున్సిపాలిటీ పరిధికి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు ఖేడ్ పట్టణ శివారులో ఆదివారం ఉదయం లీకేజీ ఏర్పడింది. సరఫరా నిలిచి పోయే పరిస్థితి నెలకొనడంతో, వేసవి దృష్ట్యా నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకుండా ఉండేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, సవిత హన్మండ్లు వెంటనే స్పందించి దగ్గరుండి సాయంత్రానికి మరమ్మతు పనులు పూర్తి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు.

కల్వకుంటలో కల్లుపెట్టెల ధ్వంసం

నిజాంపేట, మార్చి 24: మండలంలోని కల్వకుంటలో గత కొద్ది రోజులుగా కల్లు తాగితే తెమడ వస్తోందని.. నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహించారు. ఈ మేరకు ఆదివారం సరఫరా వాహనాన్ని అడ్డుకుని కల్లు పెట్టెలు, సీసాలు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో విక్రయించే కల్లులో కల్తీ విచ్చలవిడిగా సాగుతోందని, కల్లు తాగితే తెమడ, దగ్గు వస్తుందంటూ ఆరోపించారు. ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో కల్లు వాహనాన్ని అడ్డగించి ఆందోళనకు దిగి సీసాలను పగులగొట్టారు.

బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా రవీందర్

నారాయణఖేడ్, మార్చి 24: మండల బ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్షి రవీందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా సురేష్‌రావు, అనంతరావు దేశ్‌పాండే, సుజిత, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులుగా మలమంచి మనోజ్, సంతోష్ దేశ్‌పాండే, కోశాధికారిగా చంద్రకాంత్, కార్యవర్గ సభ్యులుగా సంజీవ్‌కుమార్, అనంతపద్మనాభం, ప్రథమేష్, భక్షి నవనీత్, నవీన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ముదిరాజ్‌లను బహిష్కరించలేదు

● ఖాజీపూర్ గ్రామాభివృద్ధి కమిటీ నాయకుల వెల్లడి



గ్రామపంచాయతీ వద్ద మాట్లాడుతున్న గ్రామస్థులు

మిరుదొడ్డి/అక్బర్‌పేట-భూంపల్లి, మార్చి 24: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని ముదిరాజ్‌లను బహిష్కరించామని అసత్య ఆరోపణలు చేయడం సరైందికాదని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పర్శరాములు అన్నారు. ఆదివారం గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద గ్రామస్థులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామంలోని పెద్దచెరువు, ఏడు ఎకరాల మామిడితోటను 1980లోనే గ్రామాభివృద్ధికి చెందుతుందని గ్రామకమిటీని వేయడం జరిగిందని తెలిపారు. అధికారులను, ప్రజాప్రతినిధులను తప్పుదోవపట్టించడానికి మాత్రమే ముదిరాజ్‌లు నాటకమాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు స్వామి, మధు, చిరంజీవి, ఎల్లారెడ్డి, వెంకటి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, బాబు, బిక్షపతి, హమీద్, శ్రీనివాస్, ప్రతాప్, మైసాగౌడ్ తదితరులున్నారు.

'పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు తథ్యం'

సిద్దిపేట, మార్చి 24 : కాంగ్రెస్, బీజేపీలు కపటనాటకాలెన్ని ఆడినా పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపుతథ్యమని కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. ఆదివారం కొమురవెల్లి మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్లబొల్లి కబుర్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రైతులకు సాగునీరు ఇవ్వకుండా పంటలు ఎండబెడుతూ నష్టం చేకూరుస్తుందన్నారు. దేశానికి అన్నంపెట్టే స్థాయికి బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఎదగనిస్తే కాంగ్రెస్ రైతువ్యతిరేక విధానాలతో దిగజార్చుతుందన్నారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రవికుమార్

సిద్దిపేట, మార్చి 24: విద్యారంగాభివృద్ధికి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం నిధులు కేటాయించాలని, అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చొప్పరి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం చేర్యాల పట్టణంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 3వ డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆముదాల రంజిత్‌రెడ్డి, అత్తిలి హారిక, తాడూరి భరత్, విక్రమ్, రాకేశ్, కిరణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నిక

మిరుదొడ్డి, మార్చి 24: ధర్మసమాజ్‌పార్టీ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడిగా కనకమల్లేశాన్ని ఆదివారం అక్బర్‌పేట చౌరస్తాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా మల్లేష్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా రాజేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు ప్రభాకర్, చందు, యాదగిరి, లక్ష్మన్, నందు, శ్రీనివాస్ మహారాజ్ తదితరులున్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, యువకులు

హుస్నాబాద్ రూరల్, మార్చి 24: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం నియోజకవర్గ ఓటర్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన 5కె రన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లను చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. 5కె రన్‌లో పాల్గొన్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ దేవేంద్ర, రుక్మిణి, ఆర్ఐ రాజయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

అంబులెన్స్ సౌకర్యం లేక ఇబ్బందులు

● ఆస్పత్రికి వెళ్లేందుకు రోగులకు తప్పని తిప్పలు

రాయపోల్, మార్చి 24: అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, వైద్యం అవసరమైన వారిని వేగంగా ఆస్పత్రికి చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం 108 సేవలను అందుబాటులోకి తెచ్చింది. 108 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుని రోగులను సమీప ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తారు. అలాంటి అంబులెన్స్ సౌకర్యం రాయపోల్ మండల ప్రజలకు అందుబాటులో లేదు. సుమారు పదేళ్ల క్రితం రాయపోల్ కేంద్రంగా నూతన మండలం ఏర్పాటయింది. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఉన్నది. ఉమ్మడి మండలంలో ఉన్న 108 అంబులెన్స్‌ను దౌల్తాబాద్ మండలానికి కేటాయించడంతో రాయపోల్ మండలానికి ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యం లేకుండా పోయింది. దీంతో ఆపదొచ్చిన వారికి సహాయం అందించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇతర మండలాల నుంచి వచ్చే వరకు ఆగాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో బాధితులు అత్యవసర సమయాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. అంబులెన్స్ రావడం ఆలస్యమైతే ఆస్పత్రికి చేరేసరికి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి. మరో దారి లేక కొందరు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది. రాయపోల్ మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో సుమారు 26 వేలకు పైగా జనాభా ఉంది. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రాయపోల్‌లో ప్రభుత్వ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భక్తి శ్రద్ధలతో మట్టల పండుగ



మద్దూరులో మట్టల ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

చిన్నకోడూరు/మద్దూరు మార్చి 24: చిన్నకోడూరు మండలం రామునిపట్లలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగ సందర్భంగా వారు ఈత మట్టలను పట్టుకుని గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ తీశారు. పాస్టర్ సందేశం ఇచ్చారు. మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ సోదరులు ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో రారాజైన యేసుక్రీస్తు ప్రజల రక్షణకై గాడిదపై వచ్చుచున్న సందర్భంగా ప్రజలంతా మట్టలతో స్వాగతం పలుకుతూ పాటలు పాడుతూ ఊరేగింపు చేపట్టారు. అనంతరం చర్చిల్లో ప్రార్థనలు చేసి యేసుక్రీస్తును స్తుతించారు. కార్యక్రమంలో మద్దూరు చర్చి పాస్టర్ రమేష్‌తో పాటు క్రైస్తవులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ

బెజ్జంకి, మార్చి 24: బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌ను సిద్దిపేట ఏసీపీ మధు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల పురోగతి వివరాలను ఎస్ఐ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



చేర్యాల మండలం తాడూరు ప్రభుత్వ జడ్పీఎస్ఎస్‌లో 2003-04లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. తోటిమిత్రులతో పాతజ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఉద్వేగానికి లోనయ్యారు.

- సిద్దిపేట

గడ్డపోతారంలో కట్టమైసమ్మకు బోనాలు

జిన్నారం, మార్చి 24: గడ్డపోతారంలో ఆదివారం కట్టమైసమ్మ బోనాలను సమర్పించారు. మైసమ్మ దేవాయల వార్షికోత్సవంలో పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

కస్తూర్బాలో కంపు కంపు

● డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థం

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

● పట్టించుకోని అధికారులు

మర్కుక్, మార్చి 24: మండల కేంద్రమైన మర్కుక్ కేజీబీవీ పాఠశాలలో డ్రైనేజీ సమస్య తిష్ఠ వేసింది. దుర్వాసన మధ్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎన్నిసార్లు అధికాలకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు సతమతమవుతున్నారు. భవనం కొత్తదే అయినప్పటికీ డ్రైనేజీ సమస్య ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాలేదు. పాఠశాలలోని మురుగునీరు బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతున్నది. విద్యార్థులు వివిధ అవసరాల కోసం నిత్యం ఉపయోగించే నీరు బయటకు వెళ్లే మార్గం లేక పాఠశాల ప్రాంగణంలోనే మురికి కుంట ఏర్పడింది. దీనివల్ల విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.



పాఠశాల ప్రాంగణంలో కుంటలా మారిన మురుగునీరు

దుర్వాసన భరించలేకపోతున్నాం



పాఠశాలలో రెండు ఏళ్లుగా మురికి సమస్య పరిష్కారం కావడంలేదు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. వాసనకు ముక్కు మూసుకోవాల్సి వస్తున్నది. అంతే కాదు రోగాల బారిన పడుతున్నాం. వారం వారం ఇంటికి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- పీ. రవళి, 9వ తరగతి విద్యార్థిని

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మురుగు సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోయినం. మురుగుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. పై అధికారులు స్పందించి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిచేలా కృషి చేస్తాను.

-ఎస్.ఓ భాగ్యలక్ష్మి ప్రత్యేక అధికారి

EDUCATION

★ తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా 10th, ఇంటర్ మహాత్మాగాంధీ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ ఏప్రిల్, అక్టోబర్ పరీక్షల్లో 100% పాస్ గ్యారెంటీ ప్రైవేట్ అడ్మిషన్లు కలవు, సెల్:8019383310 AJH-002296

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి





